


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 22-08-2026 సంపుటి : 08 సంచిక 66 పేజీలు : 8 వెల : రూ 3-00


# డీలిమిటేషన్‌పై ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ?



మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లు విషయంలో కేంద్రం ఏం చేయనుందన్న అంశంపై ప్రస్తుతం ఉత్కంఠ నెలకొంది. ఈ వర్షాకాల సమావేశాల్లోనే బిల్లు పెడతారన్న అంచనాలు మొదట్లో వెలువడినా పేపర్ లీక్ అంశం వివాదాస్పదం కావడంతో డీలిమిటేషన్ అంశం తెరమరుగైనట్టు కనిపించింది. అయితే, డీలిమిటేషన్ కోసం కేంద్రం ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందన్న అంచనాలు ప్రస్తుతం వెలువడుతున్నాయి.నిన్న దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో అమిత్ షా నియోజకవర్గ పునర్విభజన అంశాన్ని ప్రస్తావించారు. డీలిమిటేషన్‌ను మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్న తమిళనాడు సీఎం ఈ సమావేశం తరువాత మెత్తబడినట్టు ప్రచారం మొదలైంది. సమావేశం అనంతరం విజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత పార్లమెంటరీ ప్రాతినిధ్యంలో రాష్ట్రాల వాటా తగ్గకుండా రక్షణ కల్పించాలని అన్నారు. ఈ దిశగా కేంద్రం స్పష్టమైన హామీ ఇవ్వాలని అన్నారుఇక దక్షిణాది వాటా తగ్గకుండా ఉంటే డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకించాల్సిన అవసరం లేదనే అభిప్రాయంలో డీఎంకే కూడా ఉన్నట్టు తెలుస్తోంది. ఇటీవలి వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు ఆగస్టు 13వ తేదీ వరకు జరిగిన విషయం తెలిసిందే. ఆ తరువాత సభను ప్రోరోగ్ చేయాల్సి ఉండగా ఇప్పటివరకూ ఆ దిశగా ఎలాంటి చర్య లేకపోవడంతో కేంద్రం ఏ నిర్ణయం తీసుకుంటుందో అన్న ఉత్కంఠ పెరిగింది.

# జ్యుడీషియల్ సర్వీస్‌కు ప్రాక్టీస్ ఏడాదే..



## సుప్రీం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ జ్యుడీషియల్ సర్వీసుల్లోకి నేరుగా ప్రవేశించాలనుకునే న్యాయ విద్యార్థులకు సుప్రీంకోర్టు గుడ్ న్యూస్ చెప్పింది. సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు మూడేళ్ల న్యాయవాద వృత్తి ప్రాక్టీస్ నిబంధనను ఒక సంవత్సరానికి తగ్గించింది. మూడేళ్ల ప్రాక్టీస్ నిబంధనను తొలగించాలన్న అభ్యర్థనను పూర్తిగా తోసిపుచ్చినప్పటికీ, యువ న్యాయవాదులు ఎదుర్కొంటున్న ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని మార్పులు చేసింది.సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఆగస్ట్ జార్జ్ మసీహ్, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. ఈ అంశంపై జస్టిస్ వినోద్ చంద్రన్ భిన్నాభిప్రాయం వ్యక్తం చేశారు. సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పోస్టుల ప్రత్యక్ష నియామకాలకు కనీస అనుభవం ఉండాలన్న ప్రాథమిక ఉద్దేశాన్ని సమర్థిస్తూనే, నిబంధనలు కఠినంగా ఉండి యువ లా గ్రాడ్యుయేట్లకు ఇబ్బంది కలగకూడదని సుప్రీం కోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. 2025 మే 20 నుంచి 2027 మార్చి 31 మధ్య వెలువడే సివిల్ జడ్జి పరీక్షల నోటిఫికేషన్లకు హాజరయ్యే లా గ్రాడ్యుయేట్లకు ఎటువంటి ప్రాక్టీస్ అనుభవం లేకపోయినా దరఖాస్తు చేసుకునేందుకు సుప్రీంకోర్టు మినహాయింపునిచ్చింది. ఈ కాలంలో ఎంపికైన అభ్యర్థులు నేరుగా ట్రెయినీ జ్యుడీషియల్ ఆఫీసర్లుగా నియమితులవుతారు. అలానే వీరు స్టేట్ జ్యుడీషియల్ అకాడమీలో ఒక సంవత్సరం పాటు శిక్షణ పొందాలి.ఆ తర్వాత ఒక సంవత్సరం పాటు స్ట్రక్చర్డ్ లా క్లర్క్‌షిప్ చేయాల్సి ఉంటుంది. ఇందులో మొదటి ఆరు నెలలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి లేదా హయ్యర్ జ్యుడీషియల్ సర్వీస్ సభ్యుల పర్యవేక్షణలో, తర్వాతి ఆరు నెలలు హైకోర్టు సిట్టింగ్ జడ్జిల పర్యవేక్షణలో క్లర్క్‌షిప్ పూర్తి చేయాలి. శిక్షణ కాలంలో జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ స్థూల వేతనంలో సగానికి సమానమైన గౌరవ వేతనం అందుకుంటారు. 2027 ఏప్రిల్ 1 లేదా ఆ తర్వాత వెలువడే నోటిఫికేషన్ల ద్వారా సివిల్ జడ్జిలుగా ఎంపిక కావాలనుకునే అభ్యర్థులు కనీసం ఒక సంవత్సరం పాటు న్యాయవాద వృత్తి అనుభవాన్ని కలిగి ఉండాలి. దీనిని ధ్రువీకరణ పత్రం ద్వారా సరిచూస్తారు. ఎంపికైన తర్వాత పైన పేర్కొన్న విధంగా ఒక సంవత్సరం అకాడమీ శిక్షణ, ఒక సంవత్సరం క్లర్క్‌షిప్ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ శిక్షణ కాలం పరిపూర్ణంగా ముగిసిన తర్వాతే వారు రెగ్యులర్ పోస్టుల్లో నియమితులై పూర్తి స్థాయి వేతనాన్ని అందుకుంటారు.న్యాయ వ్యవస్థలో ప్రవేశించే ముందు అభ్యర్థులకు వృత్తిగత అనుభవం ఉండాలనే తలంపుతో పాటు, అకస్మాత్తుగా విధించిన కఠిన నిబంధనల వల్ల మహిళలు, దివ్యాంగులు, యువ లా గ్రాడ్యుయేట్లు నష్టపోకూడదనే ఉద్దేశంతో ఈ మధ్యేమార్గాన్ని ఎంచుకున్నట్లు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

# సుబ్రహ్మణ్యన్ చంద్రశేఖర్, ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ వర్ధంతి.. పవన్ కల్యాణ్ ఘన నివాళులు..



అమరావతి: ప్రముఖ శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ సుబ్రహ్మణ్యన్ చంద్రశేఖర్, ప్రఖ్యాత షెహనాయి విద్వాంసుడు ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ వర్ధంతి సందర్భంగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నివాళులర్పించారు. దేశానికి, ప్రపంచానికి వారిద్దరూ అందించిన విశిష్ట సేవలను ఆయన స్మరించుకున్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఉప ముఖ్యమంత్రి వేర్వేరు పోస్టులు చేశారు.నోబెల్ గ్రహీత డాక్టర్ సుబ్రహ్మణ్యన్ చంద్రశేఖర్ అసాధారణ ప్రతిభావంతుడని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. నక్షత్రాలు, విశ్వం గురించి మానవ అవగాహనను మరింత విస్తరించేలా ఆయన చేసిన పరిశోధనలు చిరస్మరణీయమని కొనియాడారు. 'చంద్రశేఖర్ పరిమితి' ఆవిష్కరణతో పాటు నక్షత్రాల నిర్మాణం, పరిణామంపై ఆయన చేసిన పరిశోధనలు ఖగోళ భౌతిక శాస్త్రంలో కీలకమైనవని తెలిపారు. 1983లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి అందుకున్న చంద్రశేఖర్.. ప్రపంచంలోని గొప్ప శాస్త్రవేత్తల సరసన నిలిచారని డిప్యూటీ సీఎం కొనియాడారు. జ్ఞానాన్వేషణలో ఆయన చూపిన పట్టుదల, కొత్త విషయాలను అన్వేషించాలనే తపన.. భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని పేర్కొంటూ ఘన నివాళులర్పించారు.భారతీయ శాస్త్రీయ సంగీతంలో షెహనాయికి విశిష్ట స్థానం కల్పించిన ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్‌ను పవన్ కల్యాణ్ గుర్తు చేసుకున్నారు. తన సంగీతంతో షెహనాయిని ప్రపంచ వేదికపై గౌరవప్రదమైన స్థానంలో నిలిపారని కొనియాడారు. ఆయన వాయిద్యంలోని ప్రతి స్వరం భారతదేశ గొప్ప సాంస్కృతిక వారసత్వం, భక్తి, సంగీత సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. బిస్మిల్లా ఖాన్ సంగీతం భాష, ప్రాంతం, సరిహద్దులను దాటి ప్రజలను ఏకం చేసిందని పవన్ కల్యాణ్ అన్నారు. ఆయన ఆత్మీయమైన సంగీతం తరతరాలుగా ప్రతిధ్వనిస్తూనే ఉంటుందని పేర్కొంటూ.. భారతీయ సాంస్కృతిక వారసత్వంలో ఆయన సంగీతం ఎప్పటికీ నిలిచిపోతుందని కొనియాడారు. ఈ సందర్భంగా ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్‌కు కూడా పవన్ కల్యాణ్ ఘన నివాళులర్పించారు.

# ఉయ్యూరులో డయేరియాపై అసత్యాలు ప్రచారం: మంత్రి నారాయణ ఫైర్



ఉయ్యూరు, ఆగస్టు21: ఉయ్యూరులో డయేరియాపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారంటూ మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి నారాయణ మండిపడ్డారు. శుక్రవారం ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రిలో డయేరియా బాధితులను ఆయన పరామర్శించారు. అలాగే స్థానిక 5వ వార్డులో డయేరియా సోకిన ప్రాంత ప్రజలతో ఆయన మాట్లాడి.. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో 9 మంది చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఉయ్యూరుతో పాటు పరిసర గ్రామాల్లో మొత్తం 11 మంది డయేరియాతో ఆసుపత్రిలో చేరారని వివరించారు. కేవలం ఆరుగురు మాత్రమే ఉయ్యూరు మున్సిపాల్టీ పరిధిలో ఉన్నారని పేర్కొన్నారు. వీరందరి ఆరోగ్యం నిలకడగా ఉందని స్పష్టం చేశారు.అయితే ఓ వ్యక్తి ఆగస్టు 17వ తేదీన గుండె పోటు సమస్యతో ఆసుపత్రిలో చేరి మృతి చెందారని మంత్రి నారాయణ తెలిపారు. ఆ వ్యక్తి మృతికి, డయేరియాకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. ఉయ్యూరు మున్సిపాలిటీ ద్వారా సరఫరా చేసే నీటి లైన్‌కు, ఇతర గ్రామాల్లోని నీటి సరఫరా లైన్లకు సంబంధం లేదని వివరించారు. డయేరియాకు కారణం మున్సిపల్ పైప్ లైన్ కాలుష్యమా?.. లేక ఆర్వో ప్లాంట్ల సమస్యా? అనేది తేలాల్సి ఉందని అన్నారు.ప్రాథమిక పరీక్షల ప్రకారం తాగు నీటిలో ఎలాంటి బ్యాక్టీరియా లేదని తేలిందని మంత్రి నారాయణ వివరించారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా రాష్ట్రంలో 123 మున్సిపాలిటీల్లోని పాత పైప్‌లైన్లను మారిస్తున్నామని చెప్పారు. ఉయ్యూరుకు రూ. 98 కోట్లతో అమృత్ 2.0 కింద పనులు చేపడుతున్నామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. మంత్రి నారాయణ వెంట ఎమ్మెల్యే బోడే ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బాబు రాజేంద్రప్రసాద్, జేసీ నవీన్ ఉన్నారు.

## షావుకారు జానకి మృతిపట్ల సీఎం చంద్రబాబు, లోకేశ్ సంతాపం

అమరావతి, ఆగస్టు 21: అలనాటి ప్రముఖ నటి, పద్మశ్రీ షావుకారు జానకి మృతిపట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ సంతాపం తెలిపారు. జానకి భౌతికంగా దూరమైన ఆమె నటించిన పాత్రల ద్వారా అందరి మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని సీఎం అన్నారు. వైవిధ్యమైన పాత్రలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారని మంత్రి లోకేశ్ కొనియాడారు.'అలనాటి ప్రముఖ నటి షావుకారు జానకి(94) ఆకస్మిక మరణం నాకు తీవ్రగ్భ్రాంతిని కలిగించింది. 400కు పైగా చిత్రాల్లో నటించి ఎన్నో అవార్డులు, రివార్డులు పొందిన షావుకారు జానకి భౌతికంగా మనకు దూరం అయినా ఆమె నటించిన పాత్రల ద్వారా చిరస్థాయిగా మన మనసుల్లో నిలిచిపోతారు. షావుకారు జానకి ఆత్మకు ఆ భగవంతుడు శాంతి చేకూర్చాలని కోరుకుంటున్నాను. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నాను' అంటూ ఎక్స్‌లో సీఎం చంద్రాబు పోస్ట్ చేశారు.ప్రముఖ సినీ నటి, పద్మశ్రీ షావుకారు జానకి మృతిపట్ల ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సంతాపం తెలిపారు. తెలుగు, తమిళ, కన్నడ భాషలలో సుమారు 400 చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించారన్నారు. షావుకారు సినిమా పేరునే ఇంటిపేరుగా మార్చుకున్నారని అన్నారు. వైవిధ్యమైన పాత్రలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. సినీ రంగానికి ఆమె అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. షావుకారు జానకి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. జానకి కుటుంబ సభ్యులకు మంత్రి లోకేశ్ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.




# సంపాదకీయం

శనివారం 22-08-2026

## వందేమాతరం తీవ్ర దుమారం

భారత జాతీయ గేయం వందేమాతరం చుట్టూ మరోసారి తీవ్ర దుమారం రేపుతోంది న్యూఢిల్లీలో నాలుగు గంటలపాటు సుదీర్ఘంగా సాగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో, భవిష్యత్‌లో పార్టీ అధికారిక కార్యక్రమాల్లో వందేమాతరం గేయం మొదటి రెండు చరణాలను మాత్రమే పాడాలని కాంగ్రెస్ పార్టీ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ నిర్ణయం వెలువడిన వెంటనే బీజేపీ కాంగ్రెస్‌ను లక్ష్యంగా పదునైన విమర్శలతో దాడి చేసింది. ఈ వివాదంపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తమిళనాడులోని చెంగల్పట్టులో 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం సందర్భంగా స్పందిస్తూ, కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం దేశ ప్రయోజనాలను, జాతీయ భావాలను తాకట్టు పెడుతోందని తీవ్రంగా ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నిర్ణయం కేవలం రాజకీయ స్వార్థంతో కూడుకున్నదని, ఇది దేశ విభజనకు పునాది వేసిన నాటి విధానాలే కారణమని ఆయన ఆరోపించారు. మరోవైపు బీజేపిప జాతీయ అధ్యక్షుడు నితీన్ నబీన్ కాంగ్రెస్‌ను ఏకంగా కొత్త ముస్లిం లీగ్‌తో పోల్చారు. పార్లమెంట్ చేసిన చట్టాన్ని ధిక్కరిస్తూ కాంగ్రెస్ తన పాత విధానాలనే అమలు చేయాలని చూడటం విచారకరమని విమర్శించారు. దేశం గతంలో ఒకసారి వందేమాతరాన్ని రెండు భాగాలుగా విభజించే తప్పును అంగీకరించి తీవ్ర పరిణామాలను ఎదుర్కొంది. ఇప్పుడు రాహుల్ గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ మళ్లీ అదే విధమైన రాజకీయాలను ముందుకు తీసుకెళ్తోంది. వందేమాతరాన్ని రచించిన బంకిం చంద్ర ఛటర్జీని, స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలు అర్పించిన అమరవీరులను కాంగ్రెస్ అవమానిస్తోంది." అని అమిత్‌షా అన్నారు. రాజ్యసభ సభ్యుడు, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సోషల్ మీడియా వేదికగా సుదీర్ఘమైన పోస్టు పెట్టారు. " దేశం కోసం తమ సర్వస్వాన్ని త్యాగం చేసిన వేలాది మంది అమరవీరులు ఈ వందేమాతర గేయాన్ని తమ శ్వాసగా మార్చుకొని పోరాడారు. అటువంటి పవిత్ర గేయాన్ని అవమానించడాన్ని కాంగ్రెస్ ఇప్పుడు తన అధికారిక పాలసీగా మార్చుకుంది" అని నబీన్ విమర్శించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ అధికారికంగా తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా దేశ ఆత్మగౌరవాన్ని ఓటు బ్యాంకు రాజకీయాల వద్ద తాకట్టు పెట్టారని, అందుకే నేటి కాంగ్రెస్ సరికొత్త ముస్లిం లీగ్‌గా అవతరించినట్టు కామెంట్ చేశారు. ఈ వివాదం ఆగస్టు 15 వేడుకల సందర్భంగా మొదలైంది. కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఆ సమయంలో ఎంపీ సోనియా గాంధీ వందేమాతరం పూర్తి గేయాన్ని పాడకుండా నిలిపివేయడానికి ప్రయత్నించారని బీజేపీ ఆరోపించింది. అయితే కాంగ్రెస్ ఈ ఆరోపణలను ఖండించింది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూర్చోవడానికి కుర్చీ వేయమని మాత్రమే సోనియా గాంధీ అడిగారని వివరణ ఇచ్చింది. అప్పటి నుంచి ఇరు పార్టీల మధ్య వందేమాతరం ఆలపించడంపై ఆరోపణలు, ప్రత్యారోపణలు సాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం వివాదానికి మూలాలు దాదాపు 9 దశాబ్దాల క్రితం నాటి కాంగ్రెస్ తీర్మానం. కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ తాము కొత్తగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదని 1937 నాటి కాంగ్రెస్ చారిత్రక కమిటీ సిఫార్సులనే అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. వందేమాతరం గేయాన్ని బంకిం చంద్ర చటోపాధ్యాయ 1875లో సంస్కృతం, బెంగాలీ భాషల్లో రాశారు. ఇది మొదట 1875 నవంబర్ 7న బంగదర్శన్ అనే సాహిత్య పత్రికలో ప్రచురితమైంది. ఆ తర్వాత 1881లో ఆయన రాసిన ఆనందమఠ్ నవలలో చేర్చారు. ఈ నవల బెంగాల్ ప్రాంతం బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాటు బ్యాక్‌గ్రౌండ్‌లో సాగుతుంది. 1905 నాటి స్వదేశీ ఉద్యమంలో వందేమాతరం భారతీయుల ప్రధాన సమరనాదంగా మారింది. అయితే 1937 అక్టోబర్‌లో జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష చంద్రబోస్‌కు రాసిన లేఖలో వందేమాతరం నవల ముస్లింలలో కొన్ని ఆందోళలను కలిగిస్తోందని పేర్కొన్నారు. అదే సమయంలో ఈ అభ్యంతరాలు అధిక శాతం మతోన్మాదులు సృష్టించినవని కూడా నెహ్రూ అభిప్రాయపడ్డారు. ఈ వివాదంపై రవీంద్రనాథ్ ఠాగూర్ అభిప్రాయాన్ని కోరారు. ఠాగూర్ ఈ గేయంలోని మొదటి రెండు చరణాలను, మిగిలిన చరణల నుంచి వేరు చేసి చూడాలని సూచించారు. ఠాగూర్ ఇచ్చినఈ సలహాతో 1937 అక్టోబర్‌లో మహాత్మా గాంధీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, వల్లభాయ్ పటేల్, అబుల్ కలాం ఆజాద్ వంటి ప్రముఖులతో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఒక కీలక తీర్మానం చేసింది. జాతీయ సభలలో వందేమాతరాన్ని ఆలపించేటప్పుడు కేవలం మొదటి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని ఆ తీర్మానంలో సిఫార్సు చేశారు. గాంధీ కూడా 1939 జులై నాటి హరిజన్ పత్రికలో వ్యాసం రాస్తూ...స్వదేశీఉద్యమంలోవందేమాతరం హిందూ– ముస్లింలను ఏకం చేసిన గొప్ప సమరనాదం అని పేర్కొన్నారు. కానీ, దీనిని బలవంతంగా రుద్దడాన్ని ఆయన వ్యతిరేకించారు. ఎవరైనా అభ్యంతం చెబితే సదస్సుల్లో పాడటం నిలిపివేయవచ్చని, వివాదాలకు తావు ఇవ్వకూడదని అభిప్రాయపడ్డారు. వందేమాతరం పూర్తి గేయం మొత్తం ఆరు చరణాలు ఉన్నాయి. జాతీయ గేయంగా అధికారిక హోదా పొందిన కేవలం మొదటి రెండు చరణాలు మాత్రమే. ఇందులో దేశ ప్రకృతి అందాలు,నదీ జలాలు, పచ్చనని పంట పొలాలు, ఫలసాయాన్ని వర్ణిస్తూ మాతృభూమికి ప్రణామాలు అర్పిస్తారు. దీనిపై ఎవరికి ఎలాంటి అభ్యంతరాలులేవు. 3,4, 5, 6 చరణాల చుట్టూ వివాదాలు నడుస్తున్నాయి. మూడో చరణంలో మాతృభూమి రక్షణ కోసం కోట్ల కొద్దీ చేతులు కత్తులు పట్టుకొని సిద్ధంగా ఉన్నాయని యుద్ధ సంకేతాలు ఇస్తుంది.

## గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ కనెక్టివిటీని స్టార్‌లింక్ పెంచుతుంది.. ఎలాన్ మస్క్ ప్రకటన

దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ కనెక్టివిటీని పెంచేందుకు తమ సంస్థకు చెందిన స్టార్‌లింక్ సేవలు ఉపయోగపడుతాయని ఆ సంస్థ అధినేత ఎలాన్ మస్క్ అన్నారు. దేశంలో అందుబాటులో ఇంటర్నెట్ సేవల గురించి ఒక యూజర్ ఎక్స్‌లో ఎలాన్ మాస్క్‌ను ట్యాగ్ చేయగా.. దీనికి మస్క్ బదులిచ్చాడు. ఇండియాలో ఇంకా సరైన నెట్‌వర్క్ కనెక్టివిటీ లేని చోట తన స్టార్‌లింక్ సంస్థ బూస్ట్ ఇస్తుందని, ప్రజలకు అందుబాటులో ఉంటుందని మస్క్ సమాధానమిచ్చాడు.ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్ సంస్థ కో కంపెనీయే స్టార్‌లింక్. ఇది శాటిలైట్ ద్వారా ఇంటర్నెట్ సేవలు అందిస్తుంది. ప్రపంచంలో ఏ మూల ఉన్నా, కేబుల్స్, టవర్లతో సంబంధం లేకుండా ఇంటర్నెట్ సేవలు అందించగలదు. ఇప్పటికే అనేక దేశాల్లో స్టార్‌లింక్ సేవలు ప్రారంభమయ్యాయి. ఇండియాలో కూడా ఈ సేవలు ప్రారంభం కావాలి. ఇందుకోసం సంస్థ గతంలో అనుమతివ్వాలని కోరుతూ కేంద్రానికి దరఖాస్తు కూడా చేసింది. అయితే, స్టార్‌లింక్ ఉపయోగిస్తున్న ఫ్రీక్వెన్సీలు ఇండియా నిబంధనలకు అనుగుణంగా లేకపోవడంతోపాటు ఈ సేవల ధరల విషయంలో స్పష్టత లేకపోవడం, దీని కిట్ కోసం ఎక్కువ ధర చెల్లించాల్సి రావడం, భద్రతా కారణాల రీత్యా కేంద్రం స్టార్‌లింక్ సేవలకు




అనుమతివ్వలేదు.అయితే, ఇప్పుడు కేంద్రానికి మరోసారి దరఖాస్తు చేసినట్లు తెలుస్తోంది. ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ (ఇన్–స్పేస్ఇ)కి స్టార్‌లింక్ మరోసారి దరఖాస్తు చేసింది. తమ రెండవ జనరేషన్ శాటిలైట్‌కు అనుమతివ్వాలని కోరింది. ఇది గతంలోకంటే మరింత మెరుగ్గా పని చేస్తుంది. నేరుగా డివైజ్‌తో కనెక్ట్ అవుతుంది. ఈ సంస్థ తక్కువ కక్షలో శాటిలైట్లను ప్రయోగించి, వాటి ద్వారా ఇంటర్నెట్ అందిస్తుంది. భూమికి 550 కిలోమీటర్ల ఎత్తులో నుంచి సేవలందిస్తుంది. ఇతర శాటిలైట్లు దాదాపు 36,000 కిలోమీటర్ల దూరం నుంచి పని చేస్తాయి. స్టార్‌లింక్ శాటిలైట్లు తక్కువ ఎత్తులో ఉండటం వల్ల లేటెన్సీ కూడా తగ్గుతుంది.దీంతో ఇంటర్నెట్ సులభంగా వాడుకోవచ్చు. అయితే, స్టార్‌లింక్ ధరలు భారీగా ఉన్నాయి. గత ఏడాది డిసెంబర్‌లో ఇందుకు సంబంధించిన వివరాల్ని తమ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. ఇందుకోసం బ్రాడ్‌బ్యాండ్ వాడాలంటే నెలకు రూ.8,600 చెల్లించాలి. అలాగే, హార్డ్‌వేర్ కిట్ కోసం రూ.34,000 చెల్లించాలి. అయితే, ఈ ధరలే ఫైనల్ కాదని తర్వాత సంస్థ తెలిపింది. మరోవైపు భారీ వినియోగాన్ని కూడా ఈ సంస్థ నిర్వహించలేదనే ప్రచారం ఉంది. చాలా తక్కువ మంది వాడేలా, సాధారణ కనెక్టివిటీ లేని గ్రామీణ ప్రాంతాల్లో మాత్రమే స్టార్‌లింక్ సేవలు అందించగలదనే ప్రచారం ఉంది.

## నాగార్జున సాగర్ నిండినంకనే నీటిని తరలించండి: మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్

నల్లగొండ: నీళ్ల విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులకు ద్రోహం చేస్తుందని దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఏపల్లి మండలం గణపురం స్టేజ్ సమీపంలోని ఏఎంఆర్‌పీ మెయిన్ కెనాల్ డిస్ట్రిబ్యూటర్ మెయిన్ గేట్ల వద్ద శుక్రవారం నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. సుమారు 25 వేల క్యూసెక్కుల నీటిని పోతిరెడ్డిపాడు నుంచి తరలిస్తున్నప్పుడు నాగార్జున సాగర్‌కు నీరు రాకుండా అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. నాగార్జున సాగర్ నిండేంత వరకు పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎవరి ఆదేశాలతో నీటిని తరలిస్తున్నారో ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరారు. నాగార్జున సాగర్‌లో నీరు ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు అందించేందుకు జిల్లా మంత్రి, స్థానిక ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.కేసీఆర్ హయాంలో నాగార్జున సాగర్ ఎడమ కాలువ కింద రైతులకు సమృద్ధిగా సాగునీరు అందించామని



గుర్తుచేశారు. ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే సాగునీరు అందించాలని అన్నారు. ఈ ప్రాంత రైతులు ప్రధానంగా భూగర్భ జలాలపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. చెరువులు, కుంటలు ఎండిపోవడంతో భూగర్భ జలాలు పడిపోతున్నాయి. ప్రజలు, పశువులకు తాగునీటి సమస్య ఎదురవుతుందని రవీంద్ర కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండ పట్టణానికి తాగునీటిని తరలించడంతో పాటు గుడిపల్లి, పీఏ పల్లి మండలాల్లోని చెరువులు, కుంటలను కూడా నింపాలని కోరారు.చంద్రబాబు నాయుడు ప్రయోజనాల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన ప్రభుత్వం ఇతర రాష్ట్రాల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యేకు నల్లమట్టి మీద ఉన్న ప్రేమ రైతులపై లేదని విమర్శించారు. రైతుల సాగు, ప్రజల తాగునీటి అవసరాలపై ఎమ్మెల్యే స్పందించకపోవడం బాధాకరం అని దుయ్యబట్టారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్, మండల అధ్యక్షులు వెల్లుగురి వల్లపు రెడ్డి, సీనియర్ నాయకులు కటికనేని మాధవ రావు, తోటకూరి పరమేశ్, సుధాకర్ గౌడ్, సర్పంచులు కూన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి, రైనబోయిన శ్రీను, నగేశ్, రమావత్ కిషన్, అర్వపల్లి నర్సింహ, బొడ్డుపల్లి మహేందర్, దీపావత్ నరేందర్, ఎర్ర యాదగిరి, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## ట్రయాంగిల్ లవ్‌స్టోరీ.. బెయిల్ మీద బయటకు వచ్చిన 2 వారాల్లోనే..

ట్రయాంగిల్ లవ్‌స్టోరీ కారణంగా గ్యాంగ్‌స్టర్ హత్యకు గురైన ఘటన మహారాష్ట్రలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నాగ్‌పూర్‌కు చెందిన 27 ఏళ్ల గౌరవ్ పంకజ్ రగ్డే.. రాణి అనే యువతి గత రెండేళ్ల నుంచి ప్రేమించుకుంటున్నారు. పంకజ్ రగ్డేపై తొమ్మిది క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే కొన్ని నెలల క్రితం అతడు జైలు పాలయ్యాడు. పంకజ్ రగ్డే జైలులో ఉన్న సమయంలో రాణికి గౌరవ్ రౌత్ అనే మరో గ్యాంగ్‌స్టర్‌తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారింది.నేర ప్రపంచానికి దూరంగా ఉండాలన్న ఉద్దేశ్యంతో రాణి క్లౌడ్ కిచెన్ మొదలుపెట్టింది. గౌరవ్ రౌత్, రాణి కలిసి నాగేంద్ర నగర్ ఏరియాలో ఇల్లు అద్దెకు తీసుకుని సహజీవనం చేస్తున్నారు. రెండు వారాల క్రితం రగ్డే బెయిల్ మీద రిలీజ్ అయి బయటకు వచ్చాడు. రాణి, గౌరవ్ రౌత్ రిలేషన్ ఉన్నారని, సహజీవనం చేస్తున్నారని



అతడికి తెలిసింది. దీంతో ఆగ్రహానికి గురైన రగ్డే.. గౌరవ్ రౌత్ ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో ఇంట్లో రౌత్‌తో పాటు అతడి ఫ్రెండ్ ఉన్నాడు. తలుపు లోపలినుంచి లాక్ చేసి ఉండటంతో.. రగ్డే కిటికీలోనుంచి ఇంట్లోకి రాళ్లు విసరటం మొదలెట్టాడు.భయపడిపోయిన రౌత్, అతడి స్నేహితుడు ఇంటి వెనకాల ఉన్న తలుపునుంచి తప్పించుకుని బయటకు పారిపోయారు. రగ్డే వారిని కత్తితో వెంబడించాడు. సుందర్బన్ నాలా దగ్గర రగ్డే ఇద్దరినీ అడ్డగించాడు. వారిపై దాడి చేయటం మొదలెట్టాడు. ఈ నేపథ్యంలోనే రౌత్ స్నేహితుడు వన్నిక్ అక్కడికి వచ్చాడు. ముగ్గురూ కలిసి రగ్డే చేతిలోని కత్తిని లాక్కున్నారు. ఆ కత్తితో రగ్డే మీద దాడి చేశారు. అనంతరం అక్కడినుంచి పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడ్డ రగ్డేను ఆస్పత్రికి తరలించారు. అతడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు ధ్రువీకరించారు. పోలీసులు నిందితులు ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ఇద్దరు టీచర్ల మధ్య 'అతి సాన్నిహిత్యం'.. స్కూల్ విద్యార్థులు ఫిర్యాదు



భోపాల్: ఒక ఉపాధ్యాయుడు, గెస్ట్ టీచర్ కలిసి ప్రభుత్వ స్కూల్‌లో 'అతి సాన్నిహిత్యం'గా మెలుగుతున్నారు. తరచుగా క్లాస్‌లను ముందుగానే ముగించి వారిద్దరూ కలిసి సమయం గడుపుతున్నారు. ఆ స్కూల్ విద్యార్థులు దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుడు, గెస్ట్ ఉపాధ్యాయురాలిని వేర్వేరు స్కూళ్లకు బదిలీ చేశారు. మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బీచ్ బఖ్రీ గ్రామంలోని ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలకు చెందిన ఒక ఉపాధ్యాయుడు, తాత్కాలిక ఉపాధ్యాయురాలిపై పలు ఆరోపణలు వచ్చాయి. వారిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరుగడంతో తరచుగా తరగతులను ముందుగానే ముగించి ఆ స్కూల్‌లో కలిసి సమయం గడుపుతున్నారు.కాగా, ప్రజా విచారణ సందర్భంగా ఛింద్వారా జిల్లా కలెక్టర్‌ను ఆ ప్రభుత్వ స్కూల్ విద్యార్థులు కలిశారు. ఉపాధ్యాయుడు, గెస్ట్ టీచర్ మధ్య ఉన్న 'అతి సాన్నిహిత్యం'పై ఫిర్యాదు చేశారు. దీంతో దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గిరిజన వ్యవహారాల శాఖ సహాయ కమిషనర్‌ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. నేపథ్యంలో ఈ ఆరోపణలను విచారణ కమిటీ పరిశీలించింది. ఫలితంగా ఆ ఉపాధ్యాయుడు, అతిథి ఉపాధ్యాయురాలిపై గురువారం చర్యలు చేపట్టారు. వారిని ఆ పాఠశాల నుంచి తొలగించారు. రెండు వేర్వేరు స్కూళ్లకు వారిని బదిలీ చేశారు. ఆ స్కూల్‌కు కొత్త అతిథి ఉపాధ్యాయులను నియమించాలని ఆదేశాలు జారీ చేశారు.మరోవైపు ఈ ఆరోపణలను ఆ ఇద్దరు ఉపాధ్యాయులు ఖండించారు. తమను అప్రతిష్టపాలు చేస్తున్నారని విమర్శించారు. గెస్ట్ టీచర్ పోస్ట్ కోసం దరఖాస్తు చేసిన మరో వ్యక్తి వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నారని ఆ ఉపాధ్యాయురాలు తెలిపారు. తనను తొలగించి ఆ వ్యక్తి నియామకానికి వీలు కల్పించేందుకే ఈ ఫిర్యాదు పన్నాగం పన్నారని ఆమె ఆరోపించారు.

## సీనియర్ నటి షావుకారు జానకి కన్నుమూత



తెలుగు చిత్రపరిశ్రమలో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యల కారణంగా శుక్రవారం ఆమె చనిపోయారు. షావుకారు జానకి ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబసభ్యులు ఆమెను చెన్నైలోని కావేరి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 94 ఏళ్ల వయసులో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఆమె తుది శ్వాస విడిచారు..షావుకారు జానకి మరణంపై నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. షావుకారు జానకి భౌతికకాయాన్ని శుక్రవారం సాయంత్రం 5 గంటలనుంచి తేనామ్‌పేట్‌లోని సెనోటాఫ్ రోడ్‌లో.. అభిమానులు, స్నేహితులు, చిత్ర పరిశ్రమకు చెందిన వారు నివాళులు అర్పించటం కోసం ఉంచుతామని తెలిపారు.టేకుమళ్ల జానకి 1931 డిసెంబర్ 12వ తేదీన తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించారు. విజయవారి 'షావుకారు' సినిమాతో 1950లో జానకి సినీరంగ ప్రవేశం చేశారు. మొదటి సినిమా పేరునే తన ఇంటి పేరుగా మార్చుకున్నారు. 'షావుకారు' జానకిగా పాపులర్ అయ్యారు. జానకి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో దాదాపు 380 చిత్రాలలో నటించారు. ఆమె చివరగా 2023లో వచ్చిన 'అన్నీ మంచి శకునములే' సినిమాలో కనిపించారు.

## సీజేపీ సహ వ్యవస్థాపకుడు ఆశుతోశ్ రాంకా బృందంపై దాడి.. చొక్కా చింపి మరీ దాడి..

రాజస్థాన్: కాక్రోచ్ జనతా పార్టీ సహ వ్యవస్థాపకుడు అశుతోశ్ రాంకా బృందంపై దాడి జరిగింది. జైపూర్‌లోని రాంపురా కన్వర్‌పురాలో కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు సీజేపీ బృందం లక్ష్యంగా దాడి చేశారు. వారిపై రాళ్లతో దాడి చేసి, తీవ్రంగా కొట్టి గాయపరిచారు. కార్యకర్తల కార్లు, ఫోన్లను కూడా దుండగులు ధ్వంసం చేశారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. 'స్కూల్ ఠీక్ కరో' కార్యక్రమంలో భాగంగా పాఠశాలను సందర్శించేందుకు వెళ్లగా ఈ దాడి జరిగింది.గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు రాంపురా కన్వర్‌పురాకు అశుతోశ్ రాంకా తన బృందంతో వెళ్లారు. అయితే, కాలినడకన వారు గ్రామంలోకి ప్రవేశిస్తుండగా అప్పటికే అక్కడ వేచి ఉన్న కొంతమంది వ్యక్తులు వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సీజేపీకి వ్యతిరేకంగా వారంతా నినాదాలు చేశారు. అర్బన్ నక్సల్స్, దేశద్రోహులు, పాకిస్థానీలంటూ ఆరోపించారు. అయితే, సీజేపీ బృందంలోని మహిళలు వారిని నిలువరించే ప్రయత్నం చేశారు. అయినా ఆగ్రహంతో ఊగిపోయిన ఆ గుంపు.. కార్యకర్తలపై దాడికి పాల్పడ్డారు. గ్రామంలోకి ప్రవేశించకుండా వెంటపడి మరీ తరిమికొట్టారు. రాళ్లు సైతం విసిరి తీవ్రంగా గాయపరిచారు.ఈ ఘటన అనంతరం సీజేపీ సహ వ్యవస్థాపకుడు అశుతోశ్ రాంకా స్పందించారు. ఈ దాడికి బీజేపీయే కారణమని ఆరోపించారు. గోశాలలో పాఠశాలను నిర్వహిస్తున్నారని, తమ గ్రామానికి వచ్చి తనిఖీ చేయాలని స్థానికుల ఆహ్వానం మేరకే తాము వచ్చామని రాంకా పేర్కొన్నారు. 'చాలా సంవత్సరాలుగా పాఠశాల ఓ గోశాలలో నడుస్తోంది. గతేడాదీ మేము ఇదే పాఠశాలను సందర్శించాం. ఈ రోజు పర్యటన గురించి పోలీసులకు ముందే తెలియజేశాం. కానీ బీజేపీ గూండాలు అప్పటికే అక్కడ ఉన్నారు. మా వాలంటీర్లపై దాడి చేశారు. మా కార్లు, ఫోన్లను ధ్వంసం చేశారు. ఓ మహిళపైనా దాడి చేశారు. నా చొక్కాను చింపేశారు. మా బృంద సభ్యుల్లో ఒకరి చేయి విరిగింది' అని ఆరోపించారు.

# పొలిటికల్ ఆడిటింగ్ పూర్తి ?



## విజయసాయిరెడ్డి పార్టీ టార్గెట్ ఇదే !

నెల్లూరు, ఆగస్టు 21 రాజకీయ సన్యాసం తీసుకుంటున్నట్లు ప్రకటించి రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి.. ఇప్పుడు అనూహ్యంగా తిరుమల శ్రీవారి సాక్షిగా సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటును ప్రకటించారు. ఈ నెలలోనే విజయవాడ వేదికగా పార్టీ పేరు, జెండా, విధివిధానాల రోడ్‌మ్యాప్‌ను ప్రకటిస్తానని ఆయన వెల్లడించారు.రాజకీయ సన్యాసం తీసుకుంటున్నట్లు ప్రకటించి రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి.. ఇప్పుడు అనూహ్యంగా తిరుమల శ్రీవారి సాక్షిగా సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటును ప్రకటించారు. ఈ నెలలోనే విజయవాడ వేదికగా పార్టీ పేరు, జెండా, విధివిధానాల రోడ్‌మ్యాప్‌ను ప్రకటిస్తానని ఆయన వెల్లడించారు. అయితే, వైఎస్సార్‌సీపీలో నంబర్ టూగా చక్రం తిప్పి, దేశంలోనే అగ్రశ్రేణి ఆడిటింగ్ మాస్టర్‌గా పేరొందిన విజయసాయిరెడ్డి.. కేవలం ప్రజాసేవ కోసమే కొత్త దుకాణం తెరుస్తున్నారంటే ఎవరూ నమ్మే పరిస్థితి లేదు. రాజకీయాల్లో సొంత పార్టీ నడపడం అంటే ఆర్థికంగా భారీ వ్యయంతో కూడుకున్న వ్యవహారమని తెలిసినా ఆయన ఈ అడుగు వేస్తున్నారంటే, ఆ పెట్టుబడి వెనుక అంతకుమించిన భారీ ప్రయోజనాలు, సరికొత్త లెక్కలు దాగి ఉన్నాయని స్పష్టమవుతోంది.ఈ సరికొత్త రాజకీయ ప్రయోగం వెనుక ప్రధానంగా వినిపిస్తున్న వాదన వ్యక్తిగత, వ్యాపార రక్షణ కవచం . గత ఐదేళ్ల పాలనలో విశాఖపట్నం భూముల వ్యవహారాలు, దసపల్లా భూ వివాదాలు, లిక్కర్ లావాదేవీలు, అనేక ఆస్తుల క్రయవిక్రయాల్లో ఆయనపై లెక్కలేనన్ని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాత ఫైళ్లు తిరగదోడే ప్రమాదం ఉండటం, మరోవైపు సీబీఐ, ఈడీ అక్రమాస్తుల కేసుల విచారణలు కొనసాగుతుండటంతో.. కేవలం సాధారణ పౌరుడిగా ఉంటే చట్టపరమైన ఉచ్చు బిగుస్తుందన్న భయం ఆయనను వెంటాడుతోందన్న ప్రచారం ఉంది. రేపు ఏ విచారణ సంస్థ దర్యాప్తు చేపట్టినా, రాజకీయ కక్షసాధింపు , కొత్త పార్టీ పెట్టినందుకే వేధింపులు అనే ముద్ర వేసి ప్రజాక్షేత్రంలో సానుభూతి పొందడానికి ఒక రాజకీయ పార్టీ హోదాను రక్షణ కవచంగా వాడుకోవాలన్నదే ఆయన మొదటి వ్యూహం కావొచ్చు.మరో బలమైన రాజకీయ కోణం బీజేపీ పెద్దల గేమ్ ప్లాన్ . ఢిల్లీలోని కమలనాథులతో విజయసాయిరెడ్డికి ఉన్న బలమైన సంబంధాలు అందరికీ తెలిసినవే. ఏపీలో కూటమి బలంగా ఉండటంతో నేరుగా బీజేపీలో చేరడానికి సాంకేతిక, రాజకీయ ఇబ్బందులు ఉన్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వ వ్యతిరేక ఓటు లేదా ఒక వర్గం అసంతృప్తి ఓట్లు వైఎస్సార్‌సీపీకి మళ్లీ గంపగుత్తగా పడకుండా నిరోధించేందుకు ఒక ప్రత్యేక టూల్ గా ఈ కొత్త పార్టీని రంగంలోకి దించుతున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తటస్థంగా ఉంటూనే, తెరవెనుక ఢిల్లీ పెద్దల ప్రయోజనాలకు అనుగుణంగా పావులు కదిపేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.ఇక మూడో కోణం వైఎస్ జగన్మోహన్ రెడ్డితో మైండ్ గేమ్. వైఎస్సార్‌సీపీలో సజ్జల రామకృష్ణారెడ్డి ప్రాబల్యం పెరిగి తనను పక్కనపెట్టిన నాటి నుంచి రగిలిపోతున్న విజయసాయిరెడ్డి.. తాడేపల్లి ప్యాలెస్‌కు గట్టి చెక్ పెట్టాలని చూస్తున్నారు. వైఎస్ కుటుంబానికి చెందిన నమ్మకస్తుడైన ఆడిటర్‌గా పార్టీలోని ప్రతి నాయకుడి ఆర్థిక మూలాలు, అంతర్గత బలహీనతలు, క్షేత్రస్థాయి నెట్‌వర్క్ ఆయనకు కొట్టినపిండి. కొత్త పార్టీ వేదిక ద్వారా వైఎస్సార్‌సీపీలోని అసంతృప్త నేతలను, ద్వితీయ శ్రేణి కేడర్‌ను తనవైపు తిప్పుకుని జగన్ ఓటు బ్యాంకును చీల్చగలనని బ్లాక్‌మెయిల్ చేసే ఎత్తుగడ కూడా ఇందులో దాగి ఉండవచ్చని పార్టీ వర్గాలు గుసగుసలాడుతున్నాయి.ఒక ప్రాంతీయ పార్టీని స్థాపించి క్షేత్రస్థాయిలో నిలబెట్టడం అనేది సాధారణ వ్యవహారం కాదు. కేవలం మీడియా దృష్టిని ఆకర్షించడానికో లేక బేరసారాల కోసమో పెట్టిన పార్టీలు కాలగర్భంలో కలిసిపోయిన చరిత్ర ఏపీలో ఎన్నో ఉన్నాయి. విజయసాయిరెడ్డి వేస్తున్న ఈ పాచికల వెనుక ఉన్న అసలు లక్ష్యం ? కేసుల నుంచి ఆత్మరక్షణ కోసమా, బీజేపీ రాజకీయ ప్రయోగమా లేక జగన్‌పై ప్రతీకారమా అన్నది ఆయన పార్టీ అధికారిక ప్రకటన చేసి మొదటి అడుగు వేసిన తర్వాతే పూర్తి స్పష్టత రానుంది.

## ఏపీలోనూ 22 ఏ ప్రకంపనలు

విజయవాడ, ఆగస్టు 21 మాజీ ఐపీఎస్ అధికారి, ఏపీ ఇంటెలిజెన్స్ పూర్వ అధిపతి ఏబీ వెంకటేశ్వరరావు ఇటీవల ఏపీ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారు. ముఖ్యంగా 22ం నిషేధిత భూముల జాబితా పరిరక్షణ ఆందోళనల్లో చురుగ్గా పాల్గొనడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో తీవ్రమైన వేధింపులకు, సస్పెన్షన్‌కు గురై సత్యమేవ జయతే అంటూ పోరాడిన ఆయన, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీలోకి చేరకపోవడం, పైగా పాలనా లోపాలపై గళమెత్తడం వెనుక అసలు ప్లాన్ ఏంటనేది ఆసక్తికర చర్చకు దారితీసిందిఏబీ వెంకటేశ్వరరావును టీడీపీ పార్టీలోకి చేర్చుకోనందుకే ఆయన అసంతృప్తితో విమర్శలు చేస్తున్నారు. తాను టీడీపీలో చేరాలని గతంలో అనుకున్నప్పటికీ సరైన స్పందన రాలేదని ఆయనే పలు ఇంటర్వ్యూల్లో చెప్పారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చినా ఆయన తీసుకోలేదు. అందుకే ఆ తర్వాత ఆయన మరికొంత మంది ఇతరులతో కలిసి సెంటర్ ఫర్ లిబర్టీ అనే వేదిక ద్వారా 22ం నిషేధిత భూముల జాబితా కారణంగా నష్టపోతున్న లక్షలాది మంది ప్రజల హక్కుల కోసం క్షేత్రస్థాయిలో పోరాడుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం, రెవెన్యూ అధికారులు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ స్థాయి నేతలకు అధికారుల వాస్తవాలు సరిగ్గా చేరవేడం లేదని ఆయన బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ భూముల సమస్య ప్రజా ఉద్యమంగా మారడంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే ఆయుధంగా దీనిని మలుచుకున్నారు. రోల్ బ్యాక్ 22ం పేరుతో ఉద్యమం చేస్తున్నారు. ఇక సొంత పార్టీ ఏర్పాటు ప్రకటన విషయానికి వస్తే, ఏబీ వెంకటేశ్వరరావు తన వైఖరిని స్పష్టం చేశారు. ఏదో ఒక రాజకీయం వెనుక నడవడం కంటే సమాజంలో మార్పు కోసం, పౌర హక్కుల పరిరక్షణ కోసం తమ భావసారూప్యత కలిగిన వ్యక్తులతో కలిసి కొత్త రాజకీయ పార్టీని స్థాపిస్తానని ప్రకటించారు. అధికారం పొందేందుకు కాకపోయినా, ఒక బలమైన వాచ్‌డాగ్‌గా, ఒత్తిడి గ్రూప్‌గా పనిచేయడానికే ఈ నూతన వేదిక ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.తెలుగుదేశం పార్టీ ఇలాంటి మాజీ అధికారులను , సానుభూతిపరులను ఎందుకు దూరం చేసుకుంటోందనే ప్రశ్నకు రాజకీయ వ్యూహాలే సమాధానంగా కనిపిస్తున్నాయి. మాజీ అధికారుల స్వేచ్ఛా ప్రకటనలు ప్రభుత్వ నిర్ణయాలకు అవరోధంగా మారడం, లేదా పార్టీకి క్యాడర్ ఆధారిత నాయకత్వమే ప్రాధాన్యత కావడం ఇందుకు కారణం కావచ్చు. అదే సమయంలో, సుదీర్ఘకాలం ఇంటెలిజెన్స్ వైపు పనిచేసిన అనుభవం ఉన్న వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని నియంత్రించే లోపాలను పసిగట్టి వేలెత్తి చూపిస్తుండటంతో కూటమి సర్కారుకూ ఇది ఇబ్బందికరంగా పరిణమించింది. తన చట్టపరమైన పోరాటం ముగిసిన తర్వాత, సమాజంలో ఒక ఇండిపెండెంట్ లీడర్‌గా, ప్రజా సమస్యలపై పోరాడే సివిల్ సొసైటీ వాయిస్‌గా తనను తాను నిలబెట్టుకునేందుకు వేస్తున్న వ్యూహాత్మక అడుగుగా దీనిని చూడొచ్చు.

## ప్రకాశంలో ఫ్యాన్ రెక్కలు కకావికలం

ఒంగోలు, ఆగస్టు 21 (న్యూస్ పల్స్)రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచిపోయాయి. 2024 ఎన్నికల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 8నియోజకవర్గాల్లో 6 స్థానల్లో టీడీపీ కూటమి విజయం సాధించింది. అప్పటివరకు అధికారంలో వున్న వైసీపీ కేవలం రెండు చోట్ల మాత్రమే అతి కష్టం మీద గెలిచింది. ఒంగోలు పార్లమెంట్ స్థానంలో కూడా టీడీపీ జెండా ఎగరేసింది. ఇది అందరికీ తెలిసిందే. ఈ రెండేళ్ల కాలంలో టీడీపీ బలం ఏమాత్రం తగ్గిన దాఖలాలు లేవు. వైసీపీ పుంజుకున్న ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. ఇంకా చెప్పాలంటే ఘోర ఓటమి నుంచి వైసీపీ ఇంకా కోలుకోలేదు. జిల్లాలోని అన్నీ నియోజకవర్గాల్లో ఆ పార్టీకి నాయకత్వం లేకుండా పోయిన పరిస్థితి కనిపిస్తుంది. ఒంగోలు పార్లమెంట్ కు కనీసం ఇంచార్జిని కూడా నియమించుకోలేని దీనస్థితిలో కొట్టు మిట్టాడుతోంది. గత ఎన్నికల్లో ఇక్కడ నుంచి పోటీ చేసిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నాలుగు రోజులు హడావుడి చేసినప్పటికి ఇప్పుడు ఇటు వైపు తొంగిచూడటం లేదు. ఈసారి ఎన్నికల్లో కొత్తగా అభ్యర్థిని వెదుక్కోవాల్సిన దుస్థితి వుంది. ఇక ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి ఫ్యాన్ స్విచ్చాఫ్ చేసి వెళ్లిపోయాక కార్యకర్తలు ఉక్కపోతతో అల్లాడి పోతున్నారు. చుండూరి రవిబాబు ఇంచార్జిగా పనిచేస్తున్నప్పటికీ పార్టీ శ్రేణులకు నమ్మకం కలిగించలేక పోతున్నాడు. కొండపి నియోజకవర్గంలో మరో మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ఇష్టం లేని కాపురం చేస్తున్నారు. మాటి మాటికీ పాత ఇంటి వైపు తొంగి చూస్తున్నారు. గిద్దలూరులో కుందూరు నాగార్జున రెడ్డి పరిస్థితి కూడా అంతే. ఆయనకు మార్కాపురం మీదనే మనసుంది.గిద్దలూరులో పోటీ చేస్తే గెలిచే అవకాశం ఉన్నప్పటికీ అన్నా రాంబాబు మార్కాపురం వదిలి పెట్టనని మంకు పట్టు పడుతున్నారు. ఎర్రగొండపాలెంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ కు ఆదిమూలపు సురేష్ తలనొప్పిగా తయారయ్యాడు. దర్శిలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివ ప్రసాద్ కు పార్టీలో సమస్య లేదు కానీ టీడీపీ ఇంచార్జి గొట్టిపాటి లక్ష్మి నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. కనిగిరిలో దద్దాల నారాయణను బలవంతంగా కొనసాగిస్తున్నారని పార్టీ శ్రేణులు చెప్పుకుంటున్నారు. ఇకపోతే అద్దంకి నియోజకవర్గం వైసీపీకి మింగుడు పడటం లేదు. 2019లో కూడా అక్కడ గొట్టిపాటి రవికుమార్ టీడీపీ జెండా ఎగరేశారు. ఇప్పుడు మంత్రిగా మరింత పట్టు సాధించారు. ఇక్కడ వైసీపీకి సీజన్ కు ఒకరు చొప్పున ఇంచార్జిలు మారుతున్నారు. ప్రస్తుతం అశోక్ కుమార్ ఇంచార్జిగా వున్నారు. ఈయన కొనసాగుతారో, కొత్త ఇంచార్జి వస్తాడో కేడర్ కు తెలియదు. కొండపిలో కూడా వైసీపీకి ఒక ఇంచార్జి లేడు. పార్ట్ టైమ్ లీడర్ గా సురేష్ వ్యవహరిస్తున్నట్లు కార్యకర్తలు చెప్పుకుంటున్నారు. ఒంగోలు ఎంపీ సీటు ఖాళీగా వుంది. ఇలాంటి పరిస్థితిలో పార్టీ ఎప్పటికి కోలుకుంటుందో ఏమో అని వైసీపీ శ్రేణులు గొనుక్కుంటున్నారు.

## ఆరు చోట్ల ఈడీ సోదాలు

కడప,మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో ఈడీ సోదాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి హైదరాబాద్, కడపలో మొత్తం ఆరు చోట్ల ఈడీ సోదాలు కొనసాగాయి. కడపలోని అవినాష్ రెడ్డి నివాసం సహా మరో మూడుచోట్ల ఈడీ సోదాలు జరిగాయి. సీబీఐ కేసు ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుంది. కేసులో రాజకీయ నేతల ప్రమేయం, మనీలాండరింగ్ పై ఈడీ ఆరా తీస్తోంది. హత్యకు ముందు నగదు లావాదేవీల వ్యవహారం బయటకు రావడంతో దర్యాప్తు ప్రారంభమయింది. సీబీఐ దర్యాప్తు సమయంలో బయటకొచ్చిన అంశాలపై మరింత విచారణ జరుగుతోంది. నిందితులకు ఇచ్చిన రూ.4 కోట్లు ఎక్కణ్నుంచి, ఎలా వచ్చిందన్న అంశంపై దర్యాప్తు జరుగుతున్నట్లు సమాచారం. హైదరాబాద్ ఈడీ జోనల్ అధికారుల బృందాలు సోదాలు చేస్తున్నాయి.

# ఉనికి' కోసమే జగన్ ఆరాటం !



విజయవాడ, ఆగస్టు 21 ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలు ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిలో ఆందోళనను రేకెత్తిస్తున్నాయి. తాడేపల్లి ప్యాలెస్‌లో నిర్వహిస్తున్న వరుస నియోజకవర్గాల సమీక్షా సమావేశాల్లో కేడర్‌నుద్దేశించి ఆయన చేస్తున్న ప్రసంగాలు దీనిని స్పష్టం చేస్తున్నాయి.గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రతి పంచాయతీ, వార్డులో తప్పనిసరిగా నామినేషన్లు వేసి తీరాలని ఆయన పార్టీ శ్రేణులను ఆదేశిస్తున్న తీరు.. పార్టీ బలమైన స్థితిలో ఉండి ఇచ్చే పిలుపులా కాకుండా, కనీస రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి పడుతున్న తాపత్రయంలా కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు.ఈ ఒత్తిడి వెనుక బలమైన రాజకీయ భయం దాగి ఉంది. ఒకవేళ స్థానిక ఎన్నికల బరిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నిలబడకపోతే, క్షేత్రస్థాయిలో కేడర్ పూర్తిగా నిర్లిప్తతలోకి జారిపోయిందన్న స్పష్టమైన సంకేతం ప్రజల్లోకి వెళ్తుంది. అసెంబ్లీలో 11 సీట్లకు పరిమితమైన తర్వాత, పార్టీ ఇంకా సజీవంగానే ఉందని నిరూపించుకోవడానికి చేపట్టే పర్యటనలు, రోడ్‌షోలు, భవిష్యత్ రాజకీయ వ్యూహాలు అన్నీ ఒక్కసారిగా తేలిపోతాయి. ఎన్నికల్లో పోటీ లేకపోవడం వల్ల ప్రత్యర్థి పక్షాలకు ఏకగ్రీవాలు దక్కితే, అది పార్టీ నైతిక స్థైర్యాన్ని పూర్తిగా దెబ్బతీస్తుందనే భయంతోనే ఓడిపోయినా పర్వాలేదు.. బరిలో నిలబడండి అనే నినాదాన్ని ఆయన ముందుకు తెస్తున్నారు.అయితే క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తల మానసిక స్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. ఐదేళ్ల అధికార కాలంలో సంక్షేమ పథకాల బటన్ల పంపిణీకి ఇచ్చిన ప్రాధాన్యత పార్టీకి అండగా నిలిచిన ద్వితీయ శ్రేణి నాయకులకు, సాధారణ కార్యకర్తలకు దక్కలేదనే అసంతృప్తి వారిలో బలంగా ఉంది. పాలనా వ్యవహారాల్లో అక్రమాలు, దందాల ఆరోపణలు ఎదుర్కొన్న పెద్దలు ఇప్పుడు సురక్షితంగా ఇళ్లకే పరిమితం కాగా, క్షేత్రస్థాయిలో ప్రత్యర్థుల నుంచి వచ్చే రాజకీయ ఒత్తిళ్లను, కేసులను తామే భరించాల్సి వస్తోందని కేడర్ ఆందోళన చెందుతోంది. గతంలో పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు రాకపోవడం, కొత్తగా సొంత జేబుల నుంచి లక్షలు ఖర్చుపెట్టి పోటీ చేసే ఆర్థిక స్తోమత లేకపోవడం కేడర్‌ను వెనుకడుగు వేసేలా చేస్తోంది.గ్రామస్థాయిలో ప్రత్యర్థులతో ఘర్షణ పడి ఆస్తులు, వ్యాపారాలను నష్టపోవడం కన్నా.. స్థానికంగా సర్దుబాటు రాజకీయాలు చేసుకోవడం లేదా మౌనంగా ఉండటమే మేలనే భావన వైఎస్సార్‌సీపీ శ్రేణులో పెరుగుతోంది. క్షేత్రస్థాయిలో నాయకత్వం నుంచి ఎలాంటి రక్షణ భరోసా లభించనప్పుడు, కేవలం పార్టీ పరువు కాపాడటం కోసం తాము బలిపశువులం కాలేమనే చర్చ గ్రామాల్లో జరుగుతోంది. కార్యకర్తల్లోని ఈ నైరాశ్యాన్ని గుర్తించినందువల్లే జగన్ వారిని ప్రత్యేకంగా పిలిపించి బతిమాలుకోవాల్సిన పరిస్థితి తలెత్తిందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అగ్రనాయకత్వం తన ఉనికిని చాటుకోవడానికి చూస్తున్న ఈ ప్రయత్నాలు క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులకు పొంతన లేకుండా ఉన్నాయిస్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేలా ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి రంగంలోకి దిగారు. రాష్ట్రంలో అన్ని స్థానాలకు పోటీచేయాలని, ఏ ఒక్క స్థానం ఏకగ్రీవం కాకూడదని ఇప్పటికే నియోజకవర్గ ఇంచార్జులకు ఆదేశాలిచ్చిన జగన్ రెడ్డి తాజాగా రాజమండ్రి రూరల్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. కొద్దిరోజుల్లో నిర్వహించే స్థానిక ఎన్నికల్లో విజయం కోసం వెన్నుపోటు పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు పోలీసులను ప్రయోగిస్తారని, వారిని ఎదుర్కొని యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారుప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని భావిస్తున్న ఆయన పార్టీ కేడర్ యుద్ధానికి సిద్ధంగా ఉండాలని పిలుపునివ్వడం ద్వారా ఎన్నికల్లో రాజీ లేని పోరాటం చేస్తామని సంకేతాలు పంపుతున్నారని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా, ఎన్నికల హామీలు అమలు చేయడం లేదని, ఈ కారణంగా స్థానిక ఎన్నికల్లో ప్రజలు తమ పార్టీకి ఓటేస్తారని జగన్ రెడ్డి భావిస్తున్నట్లు చెబుతున్నారు కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై జగన్ సుదీర్ఘంగా చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికలను సవాలుగా తీసుకోవాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను, ప్రజా వ్యతిరేక చర్యలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, అదే సమయంలో గతంలో తమ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేయాలని పిలుపునిచ్చారు. "పార్టీకి కార్యకర్తలే వెన్నెముక. రానున్న స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలి. కూటమి ప్రభుత్వం సాగిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనను ఎండగడుతూ, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలి" అని స్పష్టం చేశారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉండి, యుద్ధప్రాతిపదికన ఎన్నికలకు సిద్ధం కావాలని ఆయన దిశానిర్దేశం చేశారు.ఏడాదిలో పాదయాత్ర రాజమండ్రి రూరల్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి మరోసారి తన పాదయాత్రపై ప్రకటన చేశారు. ఏడాది తర్వాత తాను పాదయాత్ర చేస్తానని, ఎన్నికల వరకు ప్రజల్లోనే ఉంటానని స్పష్టం చేశారు. ఎన్నికల తర్వాత వైసీపీనే అధికారంలోకి వస్తుందని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత తీవ్రంగా ఉందని, అయితే స్థానిక ఎన్నికల్లో అది కనిపించకుండా ఉండేందుకు పోలీసులను వాడుకుంటారని ఆరోపించారు.

## ఇద్దరు టీచర్ల మధ్య 'అతి సాన్నిహిత్యం'.. స్కూల్ విద్యార్థులు ఫిర్యాదు

భోపాల్: ఒక ఉపాధ్యాయుడు, గెస్ట్ టీచర్ కలిసి ప్రభుత్వ స్కూల్‌లో 'అతి సాన్నిహిత్యం'గా మెలుగుతున్నారు. తరచుగా క్లాస్‌లను ముందుగానే ముగించి వారిద్దరూ కలిసి సమయం గడుపుతున్నారు. ఆ స్కూల్ విద్యార్థులు దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుడు, గెస్ట్ ఉపాధ్యాయురాలిని వేర్వేరు స్కూళ్లకు బదిలీ చేశారు. మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బీచ్ బహ్రీ గ్రామంలోని



ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలకు చెందిన ఒక ఉపాధ్యాయుడు, తాత్కాలిక ఉపాధ్యాయురాలిపై పలు ఆరోపణలు వచ్చాయి. వారిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరుగడంతో తరచుగా తరగతులను ముందుగానే ముగించి ఆ స్కూల్‌లో కలిసి సమయం గడుపుతున్నారు.కాగా, ప్రజా విచారణ సందర్భంగా ఛింద్వారా జిల్లా కలెక్టర్‌ను ఆ ప్రభుత్వ స్కూల్ విద్యార్థులు కలిశారు. ఉపాధ్యాయుడు, గెస్ట్ టీచర్ మధ్య ఉన్న 'అతి సాన్నిహిత్యం'పై ఫిర్యాదు చేశారు. దీంతో దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గిరిజన వ్యవహారాల శాఖ సహాయ కమిషనర్‌ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ నేపథ్యంలో ఈ ఆరోపణలను విచారణ కమిటీ పరిశీలించింది. ఫలితంగా ఆ ఉపాధ్యాయుడు, అతిథి ఉపాధ్యాయురాలిపై గురువారం చర్యలు చేపట్టారు. వారిని ఆ పాఠశాల నుంచి తొలగించారు. రెండు వేర్వేరు స్కూళ్లకు వారిని బదిలీ చేశారు. ఆ స్కూల్‌కు కొత్త అతిథి ఉపాధ్యాయులను నియమించాలని ఆదేశాలు జారీ చేశారు.మరోవైపు ఈ ఆరోపణలను ఆ ఇద్దరు ఉపాధ్యాయులు ఖండించారు. తమను అప్రతిష్టపాలు చేస్తున్నారని విమర్శించారు. గెస్ట్ టీచర్ పోస్ట్ కోసం దరఖాస్తు చేసిన మరో వ్యక్తి వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నారని ఆ ఉపాధ్యాయురాలు తెలిపారు. తనను తొలగించి ఆ వ్యక్తి నియామకానికి వీలు కల్పించేందుకే ఈ ఫిర్యాదు పన్నాగం పన్నారని ఆమె ఆరోపించారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

అవనిగడ్డ రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన కృష్ణాజిల్లా అవనిగడ్డ, పులిగడ్డ రహదారిపై చోటుచేసుకుంది. పులిగడ్డ రహదారిపై సీతాయలంక వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురుగా వస్తున్న వ్యాగన్‌ఆర్ కారును ద్విచక్ర వాహనదారుడు ఢీ కొట్టాడు. దాంతో అతడు ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. ద్విచక్ర వాహనంపై ఉన్న మహిళకు స్వల్ప గాయాలు అయ్యాయి. గాయాలైన మహిళను మెరుగైన చికిత్స నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు మోపిదేవి మండలం నాగయతిప్పకు చెందిన కంఠమనేని అప్పారావు (65) గా గుర్తించారు. నాగాయ తిప్పకు చెందిన వారు అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం ద్విచక్ర వాహనంపై వచ్చి తిరుగు ప్రయాణంలో ప్రమాదం జరిగింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అవనిగడ్డ ఇంచార్జ్ ఎస్ఐ చాణక్య ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

రాయచోటి,తల్లిదండ్రులుమందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలుడిని రాయచోటి అర్బన్ పోలీసులు సకాలంలో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.రాయచోటి పట్టణంలోని గాలివీడు రోడ్డులో గంగమ్మ ఆలయం సమీపంలోనివాసముంటున్న జయరాములు తన కుమారుడు లోకేష్‌ను మందలించడంతో బాలుడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎంతసేపటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు రాయచోటి అర్బన్ పోలీసులనుఆశ్రయించారు.అర్బన్ సీఐ వెంకట చలపతి ఆదేశాల మేరకు ఎస్ఐ చంద్రాయుడు సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు.

# మెగాస్టార్ సేవా స్ఫూర్తి--

## ఘనంగా జన్మదిన వేడుకలు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 21-నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం మెగా యూత్ ఫోర్స్ కన్వీనర్ మారెడ్డి రామయ్య ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగా రెండో రోజు బండి ఆత్మకూరు, వెలుగోడు మండలాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. పెద్దదేవళాపురంలోని ఏకశిల అభయాంజనేయస్వామి ఆలయంలో చిరంజీవి ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెలుగోడు సర్వజన ఆసుపత్రిలో గర్భిణీలు, రోగులకు బెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. బి.కోడూరులోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.మెగా యూత్ ఫోర్స్ కో-కన్వీనర్ బండపల్లి సురేష్, అధికార ప్రతినిధి పసుపుల రాజేష్ యాదవ్ సహకారంతో కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో ఎగ్జిక్యూటివ్ సభ్యులు మల్లేష్ యాదవ్, కుమార్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

# మహానందిలో వైభవంగా వరలక్ష్మీ వ్రతం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 21-మహానంది క్షేత్రంలో శ్రావణ ద్వితీయ శుక్రవారం సందర్భంగా ఆలయ ఈఓ ఎన్. శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నంద్యాల ఏజీఎన్ జ్యువెలర్స్ అధినేతలు అవ్వారు గౌరీనాథ్, సరస్వతి దంపతుల సహకారంతో సామూహిక వరలక్ష్మి వ్రతం వైభవంగా నిర్వహించారు. వందలాది మంది మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, వరలక్ష్మి కలశ ప్రతిష్ఠ, అష్టాంగ పూజ, తోరపూజలు నిర్వహించి మహిళలు పరస్పరం తోరాలు కట్టుకున్నారు. అనంతరం అమ్మవారి కలశాన్ని కోనేరులో నిమజ్జనం చేశారు. దాతలు భక్తులకు వాయనాలు అందించగా, దేవస్థానం ఆధ్వర్యంలో ప్రసాదం, భోజన ఏర్పాట్లు చేశారు.

# ఘనంగా వరలక్ష్మీ వ్రతం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 21-: తెలుగు పేటలోని శ్రీ ఘన మద్దులేటి లక్ష్మి నృసింహ స్వామి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి అర్చకులు పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం లక్ష్మి కుబేర హోమం, భక్తులచే సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మహా మంగళహారతి నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు



# రైతులకు నీరివ్వకుంటే ఉద్యమం

## -మాజీ ఎమ్మెల్యే శిల్పా--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 21-: వర్షాభావ పరిస్థితులతో రైతులు ఇబ్బందులు పడుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వైఎస్సార్సీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం నంద్యాలలోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో ఏర్పాటు



చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీశైలం ప్రాజెక్టులో నీటి నిల్వలు ఉన్నప్పటికీ కాలువలు, రిజర్వాయర్లకు నీటిని విడుదల చేయడం లేదన్నారు. వెలుగోడు రిజర్వాయర్‌లో 4, గోరుకల్లు రిజర్వాయర్‌లో 6, అవుకు రిజర్వాయర్‌లో 1 టీఎంసీ మాత్రమే నీరు ఉందని తెలిపారు. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం నిలిపివేయడం వల్ల రైతులకు నష్టం జరుగుతోందన్నారు. యూరియా కోసం రైతులు క్యూలైన్లలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందని, రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నంద్యాల అర్బన్, రూరల్ పరిధిలో సుమారు 30 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉందన్నారు. తక్షణమే కాలువలకు నీటిని విడుదల చేయకపోతే రైతులను సమీకరించి ఉద్యమిస్తామని శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏఈ నూకరాజు కుమార్తె సౌజన్య మృతదేహం లభ్యం

కాకినాడ ఆగస్టు 21ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) నూకరాజు కుటుంబం ఆత్మహత్య ఘటనలో మరో విషాదం వెలుగుచూసింది. గోదావరి నదిలో గల్లంతైన ఆయన కుమార్తె సౌజన్య మృతదేహం లభ్యమైంది. రావులపాలెం మండలం కొమరాజులంక వద్ద గురువారం ఆమె మృతదేహాన్ని అధికారులు గుర్తించారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి దాదాపు 35 కిలోమీటర్ల దూరం కొట్టుకువచ్చి ఇక్కడ తేలింది. కాకినాడకు చెందిన రైఫిల్ షూటింగ్ కోచ్ సాదిక్ ఖాన్ వేధింపులు భరించలేక నూకరాజు తన కుటుంబంతో కలిసి ఇటీవల గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఇప్పటికే నూకరాజు మృతదేహం లభ్యం కాగా, ఆయన మనవడు కార్తికేయ సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డాడు. ప్రస్తుతం నూకరాజు భార్య మీనా ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మరోవైపు, ఈ ఘటనకు ప్రధాన కారకుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సాదిక్ ఖాన్ పరారీలో ఉన్నాడు. నిందితుడి కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. కుటుంబ సమస్యలతో తీవ్ర మనోవేదనకు గురైన నూకరాజు.. సుమారు రెండు నెలల క్రితమే సాధిక్‌ఖాన్ ఇంటికి వెళ్లి తన కుటుంబాన్ని ఇకపై వేధించవద్దని వేడుకున్నట్లు సమాచారం. 'ఇప్పటివరకు ఏం జరిగిందో జరిగింది.. ఇకపై మా కుటుంబాన్ని వేధించడం ఆపేయండి' అని కోరినట్లు తెలుస్తోంది. సాధిక్ వల్ల తమ కుటుంబానికి మనశ్శాంతి లేకుండా పోయిందని, తమ ఇంటివైపు రావద్దని అతడికి చెప్పాలని సాధిక్ తల్లినీ నూకరాజు బతిమాలినట్లు సమాచారం. ఆమె కూడా కుమారుడికి హితవు పలికినప్పటికీ సాధిక్ మాత్రం ఆమె మాటలను పట్టించుకోలేదు. నూకరాజు కుటుంబం ఆత్మహత్య అనంతరం సాధిక్‌ఖాన్ పరారీలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో అతడి కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సాధిక్ ఎక్కడికి వెళ్లి ఉండొచ్చన్న కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. అతడి ఆచూకీ తెలిపితే రివార్డు ఇస్తామని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం కూడా చేస్తున్నారు. ఆత్మహత్యకు ముందే నూకరాజు వీలునామా రాసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. తనకు ఉన్న స్థిర, చరాస్తులను ముగ్గురి పేరున రాసిపెట్టినట్లు సమాచారం. ఇందులో నూకరాజు సోదరితో పాటు మరో ఇద్దరి పేర్లు ఉన్నట్లు తెలుస్తోంది. మనవడు కార్తికేయ కూడా తమతోపాటే చనిపోతాడని భావించడంతో అతడి పేరును వీలునామాలో చేర్చలేదు. ఈ అంశంపై కూడా పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. గత రెండు నెలల్లో సాధిక్‌ఖాన్ ఫోన్‌కాల్ జాబితాలో ఉన్న వ్యక్తులకు పోలీసులు ఫోన్లు చేసి వివరాలు సేకరిస్తున్నారు. సాధిక్‌తో వారికి ఉన్న సంబంధం, అతడితో జరిగిన సంభాషణలు, కుటుంబంపై వేధింపులకు సంబంధించిన ఏమైనా సమాచారం ఉందా అనే కోణంలో విచారణ సాగుతోంది. అదేవిధంగా నూకరాజు కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల్లో జరిగిన లావాదేవీల వివరాలను కూడా పోలీసులు సేకరించారు. ఆర్థిక లావాదేవీలకు ఈ ఘటనకు ఏమైనా సంబంధం ఉందా అనే అంశాన్ని పరిశీలిస్తున్నారు. నదిలో దూకడానికి ముందు సౌజన్య తన కుమారుడు కార్తికేయతో మాట్లాడినట్లు సమాచారం. 'నీకు ఈత వచ్చు.. బతికి బయటపడితే ఫలానా ఆంటీ వద్దకు వెళ్లు' అని తల్లి సౌజన్య చెప్పినట్లు కార్తికేయ పోలీసులకు తెలిపాడు. కార్తికేయ చెప్పిన ఆ మహిళ గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. అయితే ప్రస్తుతం ఆమె ఫోన్ పనిచేయకపోవడంతో ఆమెను సంప్రదించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు గురువారం గాలింపులో గోదావరిలో సౌజన్య మృతదేహం లభ్యమైంది. ఆమె తల్లి మృతదేహం కోసం రెస్క్యూ టీం ఇంకా గాలింపు కొనసాగిస్తుంది. ఏఈ నూకరాజు కుటుంబం సామూహిక ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులు, సాధిక్‌ఖాన్ పాత్ర, ఘటనకు ముందు జరిగిన పరిణామాలపై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తు పూర్తయిన తర్వాతే వెల్లడయ్యే అవకాశం ఉంది.

# గోరంట్ల గ్రామంలో నూతన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ శాఖ ప్రారంభం

కర్నూలు, ఆగస్టు 21: కోడుమూరు మండలం గోరంట్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ శాఖను జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీ నూరుల్ ఖమర్, ఐ.ఎ.ఎస్., ప్రారంభించారు. డిపార్ట్మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ మార్గదర్శకాల మేరకు 5,000కు పైగా జనాభా కలిగిన గ్రామ పంచాయతీలలో బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ గోరంట్ల గ్రామంలో నూతన శాఖను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ శ్రీ నూరుల్ ఖమర్, ఐ.ఎ.ఎస్.,మాట్లాడుతూ,



5,000కు పైగా జనాభా ఉన్న గ్రామ పంచాయతీలలో బ్యాంకు శాఖలను ఏర్పాటు చేయాలనే కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు ఉన్నాయని తెలిపారు. గ్రామీణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేయడంలో భాగంగా గోరంట్లలో నూతన శాఖను ఏర్పాటు చేసినందుకు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌ను అభినందించారు. గ్రామ ప్రజలు ఈ బ్యాంకింగ్ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పి. మోహన్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి రావడం ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. ముఖ్యంగా రైతులు, చిన్న వ్యాపారులు, స్వయం ఉపాధి పొందుతున్న వారు బ్యాంకు రుణాలు మరియు ఇతర ఆర్థిక సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ సంజయ్ కుమార్ ఝా మాట్లాడుతూ, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఒకటని, కర్నూలు జిల్లాలో ఇప్పటికే ఐదు శాఖలు ఉండగా గోరంట్లలో నూతన శాఖ ఏర్పాటుతో జిల్లాలో మొత్తం ఆరు శాఖలు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాలకు అనుగుణంగా పంట రుణాలు, బంగారు రుణాలు, వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణాలు తదితర బ్యాంకింగ్ సేవలను విస్తృతంగా అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ నూతన శాఖ ద్వారా గోరంట్లతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత సులభంగా, వేగంగా అందుబాటులోకి రానున్నాయి. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ తిరుపతి రీజినల్ మేనేజర్ సంజయ్ కుమార్ ఝా, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పి. మోహన్, గ్రామ సర్పంచు బాలకృష్ణ, బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్, బ్యాంకు అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు గోరంట్ల గ్రామస్తులు పాల్గొన్నారు.

# హామీలు అమలు చేసి ఎన్నికలకు వెళ్లాలి--

## సీపీఐ డిమాండ్--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 21-: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసిన తర్వాతే కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని సీపీఐ పట్టణ కార్యదర్శి కె. ప్రసాద్ డిమాండ్ చేశారు. నంద్యాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇల్లు లేని పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తామని ఇచ్చిన హామీ అమలు కాలేదన్నారు. మహిళలకు నెలకు రూ. 1,500, అర్హులైన వారికి పింఛన్లు తదితర హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. సీపీఐ ఆధ్వర్యంలో సుమారు 4 వేల మంది నిరుపేదల నుంచి ఇంటి స్థలాల కోసం దరఖాస్తులు ఇప్పించినా ఇప్పటివరకు భూమిని గుర్తించలేదన్నారు. నంద్యాల శివారు ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వీధి కుక్కలు, దోమలు, విషజ్వరాల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమస్యలను పరిష్కరించకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళితే ప్రజల నుంచి వ్యతిరేకత తప్పదని హెచ్చరించారు. సమావేశంలో జి. లక్ష్మీదేవి, డి. శ్రీనివాసులు, సుశీలమ్మ, హరినాథ్, సరోజమ్మ, ఖలీల్, శారద తదితరులు పాల్గొన్నారు.

# దాతల సహకారంతో పూజా కార్యక్రమాలు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 21-నంద్యాల పట్టణంలో తెలుగు పేటలోని శ్రీ ఘన మద్దులేటి లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో దాతల సహకారంతో శ్రీ మహాలక్ష్మీదేవి అమ్మవారికి అభిషేకం, పూలమాలలు, లక్ష్మి కుబేర హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు శ్రీ మాధం దేవరెంటి దినేష్ రాయల్, ఆయన ధర్మపత్ని శ్రీమతి లక్ష్మి చైతన్య దంపతులు సహకరించారు. అలాగే అమ్మవారికి వస్త్రాలను శ్రీ కొత్తపేట విజయ్‌కుమార్, ఆయన ధర్మపత్ని శ్రీమతి శేషకుమారి దంపతులు సమర్పించారు. దాతల కుటుంబాలపై అమ్మవారి కరుణాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని ఆలయ నిర్వాహకులు ఆకాంక్షించారు.

# ఏపీపీఎస్సీ, డీఎస్సీకి తేడా తెలియని వ్యక్తి జగన్

విజయవాడ ఆగస్టు 21,మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి మధ్య తేడా తెలియని ఫస్ట్ క్లాస్ స్టూడెంట్ జగన్ రెడ్డి అని ఆయన ఎద్దేవా చేశారు. నెల రోజుల పాటు పరిశోధన చేసి, ఏపీపీఎస్సీ, డీఎస్సీ రెండూ ఒకటేనని కనుగొన్న గొప్ప మేధావి జగన్ అంటూ సెటైర్లు వేశారు. ఈ సందర్భంగా బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ.. "ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించే పరీక్షలపై జగన్‌కు కనీస అవగాహన లేదు. టీచర్ పోస్టులకు, గ్రూప్-1 పోస్టులకు తేడా తెలియని గొడ్డలి పార్టీ అధినేత ఆయన. గత ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకుండా యువతను గంజాయికి బానిసలను చేశారు. నిరుద్యోగుల జీవితాలతో రాజకీయం చేయడం మాత్రం వారికి బాగా తెలుసు" అని ఆరోపించారు."కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇస్తే కోర్టు కేసులు వేయించడం, గతంలో ఉద్యోగం అడిగితే వాలంటీర్ పోస్టులు ఇవ్వడం గొడ్డలి పార్టీ నైజం. గొడ్డలి వేటు లెక్కలు తెలిసిన వారికి నిరుద్యోగి కన్నీటి విలువ ఏం తెలుస్తుంది?" అని ఆయన ప్రశ్నించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పెద్ద మనసు చేసుకుని, వయోజన విద్యా పథకం కింద జగన్‌కు చదువు చెప్పించాలని బ్రహ్మానంద రెడ్డి విజ్ఞప్తి చేశారు. లేదంటే.. టీచర్లను మద్యం షాపుల దగ్గర కాపలా పెట్టినట్లు, భవిష్యత్తులో మెకానిక్‌లను డాక్టర్లుగా, డాక్టర్లను తాపీ మేస్త్రీలుగా చెప్పే ప్రమాదం ఉందని ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**